చవితి వేడుకలకు సర్వం సిద్ధం

- కొనుగోలుదారులతో వీధులు కిటకిట
- జోరుగా పత్రి, పూలు, పళ్ల విక్రయాలు
- మండపాలకు తరలివెళుతున్న గణనాథులు

వాడవాడలా వినాయక చవితి పండుగ వాతావరణం సంతరించుకుంది. ఎటుచూసినా జనంతో వీధులన్నీ కిక్కిరిసి కనిపించాయి. ప్రధాన వీధులన్నీ వినాయకుడి ప్రతిమలు, చవితి పూజకు అవసరమైన పత్రి, ఇతర పూజా సామాగ్రితో కనువిందు చేస్తోంది. వీటి కొనుగోలు కోసమని వచ్చిన జనంతో అన్ని చోట్లా రద్దీ నెలకొంది. పలు ప్రాంతాల్లో వినాయక చవితి పూజా పందిళ్లు పోటాపోటీగా ఏర్పాటుచేశారు. భారీ విగ్రహాలను తీసుకొచ్చి, డీజే సహా పందిళ్లను రకరకాలుగా అలంకరణ చేస్తున్నారు.


వినాయక విగ్రహాన్ని తీసుకువెళుతున్న యువకులు


వినాయక ప్రతిమలు అందిస్తున్న తహసీల్దార్, ఎస్ఐ

చెరుకుపల్లి: చవితి వేడుకలకు సర్వం సిద్ధమయ్యాయి. మండలంలోని ప్రతి గ్రామంలో వినాయక చవితి సందడి వాతావరణం నెలకొంది. గణపతి నవరాత్రి ఉత్సవాలకు కమిటీ నిర్వాహకులు సర్వం సిద్ధం చేస్తున్నారు. వినాయక వ్రతానికి కావాల్సిన పువ్వులు, పూజా సామాగ్రి, ఇతర వస్తువులు కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేసిన దుకాణాలు రద్దీగా మారాయి. మండల కేంద్రంలో ఎటు చూసినా గణపతి ప్రతిమలు, పత్రి విక్రయించే దుకాణాలే కనిపిస్తున్నాయి.

మట్టి ప్రతిమలే మేలు..

పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినాయక చవితికి మట్టి విగ్రహాలనే పూజించాలని తహసీల్దార్ సీహెచ్ పద్మావతి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మంగళవారం చెరుకుపల్లి మండల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో వినాయకుని మట్టి ప్రతిమలను ప్రభుత్వ కార్యాలయాల సిబ్బందికి, ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ టి.అనిల్‌కుమార్, ఎంఈవో టి.నవీన్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో కేజీపీ శ్రీనివాసన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాలనీల్లో విగ్రహాల ఏర్పాటు..

భట్టిప్రోలు: తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) నిధులతో ఎస్సీ, ఎస్టీ, మత్స్యకారుల కాలనీల్లో శ్రీవాణి ట్రస్ట్ ద్వారా వినాయక మండపాలను ఏర్పాటు చేస్తున్నామని జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ మంగళవారం తెలిపారు. ఘనంగా నిర్వహించే ఈ వేడుకలకు మండలంలోని ప్రజలు తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, రేపల్లె సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ చింతల మురళీకృష్ణ, పరియోజన ప్రముఖ్ పడమటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న గంటా నవీన్ బృందం


ప్రతిమలను పంపిణీ చేస్తున్న కాలుష్య నియంత్రణ మండలి

బాపట్ల: మట్టి వినాయక ప్రతిమలను పూజించడంతో కాలుష్యాన్ని నివారించవచ్చని ప్రొటెక్ట్ సంస్థ కార్యదర్శి ఎస్.చంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రొటెక్ట్ సంస్థ ఆధ్వర్యంలో 1000 మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా అందిస్తున్నామని నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి ఏఈ వర్మ, అడ్వకేట్ భోగిరెడ్డి రమేష్‌రెడ్డి, కొమ్మినేని సరిత, తదితరులు పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది'లో రైతులకు అవగాహన

వేమూరు: రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మండల వ్యవసాయాధికారి పి.ప్రేమ్‌కుమార్ తెలిపారు. వేమూరు మండలంలోని కుచ్చెళ్లపాడు, వెల్లబాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు, కౌలు రైతులు సాగు చేస్తున్న పంటలను 'ఈ పంట' నమోదు చేసుకోవాలని తెలిపారు. రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

అమర్తలూరు(వేమూరు): రైతులు సాగు చేస్తున్న పంటలను 'ఈ పంట'లో నమోదు చేయాలని వ్యవసాయ విస్తరణాధికారి మణికంఠ తెలిపారు. అమర్తలూరు మండలం ప్యాపర్రు, బోడపాడు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవసాయశాఖ ద్వారా అమలవుతున్న పథకాలను ఆయన రైతులకు వివరించారు. కార్యక్రమంలో బోడపాడు సొసైటీ మెంబరు వెంకటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు మణిపుజ్య, రైతులు పాల్గొన్నారు.


కుచ్చెళ్లపాడు కార్యక్రమంలో వ్యవసాయాధికారి ప్రేమ్‌సాగర్

ఉత్సవ కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న పట్టణ సీఐ మల్లికార్జునరావు


నిర్వాహకులను సూచనలిస్తున్న ఎస్ఐ శివయ్య

రేపల్లె: వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా జరిగేలా ఉత్సవ కమిటీ సభ్యులు సహకరించాలని పట్టణ సీఐ మల్లికార్జునరావు కోరారు. స్థానిక తాలూకా ప్రాంగణంలో మంగళవారం వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చవతి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో కమిటీ సభ్యులు బాధ్యతగా ఉండాలన్నారు. విగ్రహం ఏర్పాటు చేసిన నాటి నుంచి నిమజ్జనానికి తరలించేంత వరకూ కమిటీ సభ్యులు పూర్తి బాధ్యత వహించాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల పేరుతో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించరాదని సూచించారు. విగ్రహాల వద్ద రాజకీయ పార్టీ జెండాలు, రాజకీయ పార్టీల పాటలు ప్రదర్శించరాదన్నారు. నిమజ్జనం రోజున పోలీసు అధికారులుకు సహకరించాలని కోరారు.

భట్టిప్రోలు: మండలంలోని విగ్రహాల మండపాలు, నిర్వాహకుల ఏర్పాట్లను ఎస్ఐ ఎం.శివయ్య సిబ్బందితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ప్రశాంతమైన వాతావరణంలో పండుగ జరుపుకోవాలని ఎస్ఐ నిర్వాహకులకు సూచించారు.

స్వమిత్వ పథకంతో భూతగాదాలకు పరిష్కారం

తెనాలి టౌన్: స్వమిత్వ పథకంతో భూతగదాలకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు ఇంటి లబ్ధిదారులకు ప్రాపర్టీ కార్డు ఇవ్వనున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో వైవీడీ ప్రసాద్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని డిజిటల్ అసిస్టెంట్‌లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు స్వమిత్వ సర్వేపై శిక్షణ తరగతులు నిర్వహించారు. వైవీడీ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, మండల సర్వేయర్ మరకా శ్రీనివాసరావు పాల్గొని డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు పలు సూచనలు చేశారు. డిప్యూటీ ఎంపీడీవో మాట్లాడుతూ.. మండల పరిధిలో 8 గ్రామాలల్లో స్వమిత్వ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెదరావూరు, చావావారిపాలెం, అంగలకుదురు, కొలకలూరు, హాఫ్‌పేట, జగ్గడిగుంటపాలెం, నేలపాడు, బుర్రిపాలెం గ్రామాల్లో సర్వే చేపడుతున్నట్లు వివరించారు. సర్వే పూర్తయిన తరువాత గ్రామాల్లోని ఇంటి లబ్ధిదారులకు ప్రాపర్టీ కార్డు ఇస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజనల్ సర్వేయర్ సారథి, మండల పరిధిలోని డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వైవీడీ ప్రసాద్

రేపు తెనాలిలో 57వ నూతన శాఖ ఆరంభం

విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ జేవీ సత్యనారాయణమూర్తి

తెనాలి: సమాజంలో పెరుగుతున్న ఆర్థిక అంతరాల తగ్గింపునకు సహకార వ్యవస్థ బలోపేతమే పరిష్కారమని ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. తెనాలిలోని కొత్తపేటలో గురువారం ఆ బ్యాంక్ 57వ నూతన శాఖను ప్రారంభించనున్న సందర్భంగా మంగళవారం బ్రాంచిలో సంస్థ డైరెక్టర్లతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ తెలుగు రాష్ట్రాల్లో 56 శాఖలతో బహుళ రాష్ట్రాల బ్యాంక్‌గా ప్రజలకు సేవలను అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. భారతదేశ సహకార చిత్రపటంలో నాన్‌షెడ్యూల్డ్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకుల్లో అతి పెద్దదిగా సహకార సూత్రాలకు కట్టుబడి పనిచేస్తున్నదని తెలిపారు. సమావేశంలో బ్యాంక్ డైరెక్టర్లు ఆచార్య నన్నపనేని అంజయ్య, చిన్నం కోటేశ్వరరావు, చుక్కపల్లి రామారావు, పీవీ మల్లికార్జునరావు, డిప్యూటీ సీఈవో ఎంవీ గణేష్‌కుమార్, విజయవాడ జోనల్ మేనేజర్ ఎస్ఎస్ఆర్ మూర్తి, తెనాలి శాఖ మేనేజరు జీఎల్‌వీ ప్రకాశరావు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి

జిల్లా కలెక్టర్ వెంకటమురళీ

కర్లపాలెం: తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విధంగా విద్యార్థులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా కలెక్టర్ వెంకటమురళీ తెలిపారు. మంగళవారం యాజలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన తనిఖీ చేసి విద్యార్థులతో ముచ్చటించారు. తమ పిల్లలు ప్రయోజకులైనప్పుడే తల్లిదండ్రులు తాము పడిన కష్టాలను మర్చిపోతారని తెలిపారు. చదువు కష్టంగా ఉన్నప్పటికీ ఇష్టంగా చదివి సమాజ అభివృద్ధి కోసం పాటు పడాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

పెదకాకాని (ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నేషనల్ దళిత్ స్టూడెంట్ ఫెడరేషన్ ఎన్‌డీఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘం 2025–26 విద్యా సంవత్సరానికి మంగళవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా డి.దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడిగా ఎల్.రఘువంశ ప్రసాద్, కార్యదర్శిగా జి ప్రశాంత్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా బి.లోకేష్, కార్యనిర్వాహక కార్యదర్శిగా వి.శ్యాంసుందర్, కోశాధికారిగా ఆర్.కావ్యలతోపాటు మరొక 13 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

మదర్‌థెరిస్సా జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి


బహుమతులు అందుకున్న విద్యార్థులతో రామ్మోహనరావు

తెనాలి అర్బన్: మదర్‌థెరిస్సా జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి అధ్యక్షుడు వై.రామ్మోహనరావు పేర్కొన్నారు. మదర్‌థెరిస్సా జయంతిని గంగానమ్మ పేటలోని తోటకూర సుబ్బారావు మున్సిపల్ పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వ్యాస రచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వెలగా సుభాష్‌చంద్రబోసు, వెలగా శరత్‌బాబు, జంపని పాల్ ప్రసాద్, అలపర్తి రామ్మోహనరావు, హెచ్‌ఎం సోమరౌతు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని విద్యార్థికి తీవ్రగాయాలు



గుంటూరు రూరల్: డ్రైవర్ మద్యం మత్తులో మితిమీరిన వేగంతో ట్రాక్టర్‌ను నడుపుతూ సైకిల్‌పై వెళుతున్న విద్యార్థిని ఢీకొనటంతో విద్యార్థికి తీవ్రగాయాలైన సంఘటనలో నల్లపాడు పోలీస్ స్టేషన్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. నల్లపాడు పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గోరంట్ల గ్రామానికి చెందిన తాడేపల్లి సాయిశ్రీచరణ్ నగరాలులోని ఒక ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం సమయంలో స్కూలు నుంచి ఇంటికి తన సైకిల్‌పై వెళుతుండగా గోరంట్ల గ్రామంలో మితిమీరిన వేగంతో వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. దీంతో విద్యార్థి తీవ్రగాయాలవగా స్థానికులు అప్రమత్తమై విద్యార్థిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ పరారయ్యేందుకు ప్రయత్నించగా స్థానికులు అతన్ని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. సంఘటనపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నా రు. ఆసుపత్రిలో తీవ్రగాయాలైన విద్యార్థి కాలు ను తొలగించాల్సి వచ్చిందని ఎన్నో ఆశలతో పెంచుకుంటున్న కొడుకు నేడు వికలాంగుడయ్యాడని విద్యార్థి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

హెచ్ఐవీ నియంత్రణపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐసీటీసీ కౌన్సిలర్

కొల్లూరు: హెచ్ఐవీ మహమ్మారి నియంత్రణలో విద్యార్థుల పాత్ర కీలకమని ఐసీటీసీ కౌన్సిలర్ పేరమ్మ అన్నారు. మంగళవారం కొల్లూరు బాలుర, బాలికోన్నత పాఠశాలల్లో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి, సిరి మహిళా సాధికారిక వెల్ఫేర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులుకు ఎయిడ్స్ వ్యాధి నియంత్రణపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు కౌమార దశ నుంచి ఎయిడ్స్ వ్యాధి పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండి సమాజంలో హెచ్ఐవీ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులు మత్తు పదార్థాలు, దురాలవాట్లకు దూరంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంఎస్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు మేనేజర్ రవీంద్ర, ఎస్ఎంఎస్‌డబ్ల్యూఎస్ ఓఆర్‌డబ్ల్యూఎస్‌లు జి.సునీత, జె.రాజు, డి.కమల్‌హసన్, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా వలంటీర్లు నిరక్షరాస్యులను గుర్తించాలి

ఎడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్ శివరామకృష్ణ


మాట్లాడుతున్న శివరామకృష్ణ

భట్టిప్రోలు: విద్యా వలంటీర్లు నిరక్షరాస్యులను గుర్తించాలని ఎడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్ శివరామకృష్ణ తెలిపారు. భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల మహిళా సమాఖ్య కార్యనిర్వాహక సమావేశం, వీవోఏలతో జాలాది ధనలక్ష్మి అధ్యక్షతన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ.. చిన్న సంఘాలు, గ్రామ సంఘాల సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించి ప్రతి మహిళకు ఆర్థిక లావాదేవీలపై అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ప్రాజెక్ట్ నిర్ణయించిన లక్ష్యాల మేరకు పాడి గేదలు, కోళ్ల పెంపకం, సోలార్, గడ్డి పెంపకం, బ్యాంక్ లింకేజీ, స్త్రీ నిధి, మొబైల్ బుక్ కీపింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ చేతుల మీదగా అవార్డులను అందుకున్న డిప్యూటి తహసీల్దార్ అనగాని శాంతాలక్ష్మి, వేమూరు క్లస్టర్ సీసీఎల్‌సీ కంచర్ల శ్రీనివాసరావు ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, వీవోఏ కొనకాల ఉషారాణి, మండల సమాఖ్య అధ్యక్షురాలు జాలాది ధనలక్ష్మిలను మండల సమాఖ్య ఈసీ సభ్యులు, వీవోఏలు, సీసీలు, అకౌంటెంట్ తదితరులు ఘనంగా సన్మానించారు.

అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలి


ఎరువుల నిల్వలు పరిశీలిస్తున్న ఏవో మహేష్‌బాబు


తనిఖీలు చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ సభ్యులు

రేపల్లె: వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ సాగులో కలిగే సందేహాలు నివృత్తి చేయాలని రేపల్లె వ్యవసాయ అధికారి మహేష్‌బాబు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని రాజుకల్వ, గంగడిపాలెం గ్రామలలో మంగళవారం రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ క్రాపింగ్ బుకింగ్ విధానం, ఇన్సూరెన్సులు, అన్నదాత సుఖీభవ తదితర అంశాలను రైతులకు వివరించారు. రైతు సేవా కేంద్రం పరిధిలో ఉన్న ఎరువుల నిల్వలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో వీఏఏ గోపిరాజు, ఎంపీఈవో సతీష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

వేమూరు: ఎరువులు షాపుల్లో నిర్వాహకులు యూరియా నిల్వ చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ సభ్యులు తహసీల్దార్ సుశీల తెలిపారు. మండల కేంద్రంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ సభ్యులు ఎరువుల దుకాణాలను మంగళవారం తనిఖీ చేశారు. ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం అమ్మకాలు చేయాలని ఆమె సూచించారు. అధిక ధరలకు అమ్మకాలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.ప్రేమ్‌సాగర్, ఏఎస్ఐ కుమార్ స్వామి పాల్గొన్నారు.

పశువులకు డివార్మింగ్ చేయించాలి

దావులూరు(కొల్లిపర): రానున్నది శీతాకాలమని.. కావున పాడి రైతులు ప్రతి ఒక్కరూ పశువులకు డివార్మింగ్ చేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ డి.ఆర్.ప్రభు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని దావులూరు గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా పశువులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు కృత్రిమ గర్భధారణ ద్వారా పశువులకు ఆడ దూడ మాత్రమే పుట్టే విధంగా కొత్త సాంకేతికత వచ్చిందన్నారు. దీంతో కృత్రిమ గర్భధారణ చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్‌లు ఆర్.అపర్ణ, డాక్టర్ సుధాకర్, పాడి రైతులు పాల్గొన్నారు.


ఉచితంగా మందులు అందిస్తున్న వైద్యులు

క్లుప్తంగా

ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు

బాపట్ల: బాపట్ల నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. గణపతి కృపతో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని కోన కోరారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో వినాయక పూజలు నిర్వహించుకోవాలని ఆయన సూచించారు.

భట్టిప్రోలు: వినాయకుడి దీవెనలతో మీ జీవితం మరింత శుభప్రదంగా మారాలని ఆకాంక్షిస్తూ అందరికీ వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉత్సవాలు జరుపుకోవాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

చేనేత కార్మికుల హామీలను అమలు చేయాలి



భట్టిప్రోలు: రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని.. లేని ఎడల రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని చేపట్టనున్నట్లు రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ డిమాండ్ చేశారు. సెప్టెంబరు 8న రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించనున్న కరపత్రాలను మంగళవారం భట్టిప్రోలు రైలుపేట సొసైటీలో ఆవిష్కరించారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు కార్మికులకు ఇచ్చిన హామీలను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. వాటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు దీపాల సత్యనారాయణ, మురుగుడు సత్యనారాయణ, చేనేత నాయకులు బి.నాగమల్లేశ్వరరావు, జి.మురళీకృష్ణ, ఎ.శ్రీనివాసరావు, కె.పార్థసారథి, కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సమస్య లేకుండా చూడాలి



బాపట్ల: నరసాయపాలెం గ్రామానికి సాగునీటి సమస్య లేకుండా చూడాలని గ్రామస్తులు జలవనరుల శాఖ డీఈ ఎన్‌కేవీ ప్రసాదరావు దృష్టికి తీసుకువచ్చారు. మంగళవారం స్థానిక కామ్రేడ్ కొల్లా వెంకయ్య విజ్ఞాన భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామపెద్దలు అధికారులతో మాట్లాడారు. ఈ ఏడాది ప్రారంభం నుంచే అతివృష్టి, అనావృష్టిని ఎదుర్కొంటున్నామని గ్రామపెద్దలు వివరించారు. సమావేశంలో ఏఈ జి.నీలిమ, నల్లమడ లాక్ సూపరింటెండెంట్ ఎల్ఎస్ అప్పారావు, గ్రామ రైతులు రవి, శివయ్య, గోవాడ సత్యం, మానం విజయచంద్, నన్నపనేని భాను, యార్లగడ్డ వెంకటేశ్వర్లు, మెడ మోహనరావు, ముప్పలనేని అక్కరావు, ప్రశాంత్, మన్నె చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



తెనాలి అర్బన్: నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు సూచించారు. 26వ వార్డు వెటర్నరీ హాస్పటల్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న కల్వర్ట్ నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం 21వ వార్డులో పారిశుద్ధ్య నిర్వాహణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెనాలి పట్టణంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేస్తున్న నేటి పాలకులు

కొల్లిపర: దేశ పరిపాలనకు ఆలంబనగా ఉన్న రాజ్యాంగాన్ని నేటి పాలకులు విచ్ఛిన్నం చేస్తున్నారని సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్.భావనారాయణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆరెమండ కల్యాణ మండపంలో వివిధ రంగాల కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాజ్యాంగ మూల స్తంభాలైన ప్రజాస్వామ్యం, లౌకిక తత్వం, ఫెడరలిజం, సామాజిక న్యాయం, స్వావలంబన అంశాలకు నేడు పాలకుల నుంచే ప్రమాదం ఎదురైందని ఆయన పేర్కొన్నారు. సమావేశానికి ములకా శివసాంబి రెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగుల నాయకులు శ్యామ్, జయప్రద, నిర్మల జ్యోతి, కోటా చంద్రశేఖర్, ఎం.రమేష్, కుర్ర శివలీల, హైమావతి, రమణ, సీహెచ్ సంతోష్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.